క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



కళశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కోసిగి: మండల కేంద్రంలోని దుర్నిగేని కుల బాంధవుల ఆరాధ్య దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి విశేష పూజలు చేపట్టారు. శనివారం వేకువజాము నుంచి కాలనీలో కొలువు దీరిన స్వామి వారికి అభిషేకాలు, పంచామృతాభిషేకం, మహామంగళ హారతులు చేపట్టారు. దుర్నిగేని కులస్తులు ప్రతి ఇంటి నుంచి మహిళలు, చిన్నారులు కళశాలతో మెయిన్ గాంధీనగర్ రోడ్డు నుంచి ర్యాలీగా ఆలయం చేరుకుని స్వామి వారికి నారికేలాలు, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎంపీపీ ఈరన్న, జగదీష్ స్వామి, బుళ్లి నరసింహులు, బండ్ల గోవిందు పాల్గొన్నారు.

పీఆర్‌సీ బకాయిలను విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు బి.రామాంజనేయులు

ఆదోనిసెంట్రల్: 2022 పీఆర్‌సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు బి.రామాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో శనివారం ఎస్టీయూ ఆదోని డివిజన్ స్థాయి సమావేశం ఆదోని మండల ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. బి.రామాంజనేయులు మాట్లాడుతూ.. 25 వేల పోస్టులతో డీఎస్సీ అని చెప్పి కేవలం 6,100 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయడం సబబు కాదన్నారు. వెంటనే డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లా అనదపు ప్రధాన కార్యదర్శి యం.సి.సుంకన్న, ఆదోని మండలాధ్యక్షుడు సి.రామకృష్ణ, ఆర్థిక కార్యదర్శి పి.షేక్షావలి, గౌరవాధ్యక్షుడు ఎల్.రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆయా ఆలయాలు సందడిగా మారాయి. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె, బుదుములదొడ్డి , ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు జరిపించారు. అలాగే కౌతాళంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు చేపట్టారు.

వీరశైవులు అన్ని రంగాల్లో రాణించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పీఠాధిపతి గురుసిద్ధస్వామి దేవరు, అతిథులు

ఆదోనిఅర్బన్: వీరశైవులు అన్ని రంగాల్లో రాణించాలని కల్లుమఠం పీఠాధిపతి గురుసిద్ధస్వామిదేవరు అన్నారు. ఆదోని కన్నడ సంఘం అధ్యక్షుడు శరణబసప్ప నాయకత్వంలో శనివారం శ్రీ వీరశైవ కల్యాణ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కల్లుమఠం పీఠాధిపతితో పాటు ఆదోని పురపాలక సంఘం చైర్మన్ శాంత, కర్ణాటక వీరశైవ విద్యావర్ధక సంఘం ప్రధాన కార్యదర్శి శంకర హాలకట్టి అతిథులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. చేసే పని పట్ల నిబద్ధత, దేవుని పట్ల నమ్మకం ఉంచి చేపడితే విజయం సిద్ధిస్తుందన్నారు. అనంతరం కన్నడ విద్యార్థినీ, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు కవి సమ్మేళనం నిర్వహించారు. కన్నడ మాట్లాడే వారిని, వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన వారిని కన్నడ సంఘం వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దేశాయి చంద్రన్న, కె.ఎం.మల్లికార్జునస్వామి, ఉపాధ్యాయులు రాము, క్రిష్ణమూర్తి, చెన్నబసవ, సిద్ధన్నగౌడ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

కౌతాళం: అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోసిగి సీఐ ప్రసాద్ సూచించారు. మండలంలోని సుళేకేరి గ్రామంలో శనివారం పోలింగ్ బూతులను ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరూ కలిసి మెలసి ఉంటూ శాంతియుత జీవనం కొనసాగించాలని చెప్పారు.

వీధి వీధిలో అభివృద్ధి

- ప్రగతి పథంలో దూసుకెళ్తున్న 4వ వార్డు
- సందు సందునా సీసీ రోడ్లు, మురుగు కాలువలు
- తాగునీటి పైపులైన్ల ఏర్పాటు

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీలో వీధి విధినా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టులు, పైపులైన్లు ఏర్పాటవుతున్నాయి.గతంలో ఎన్నడూ లేనంతగా మున్సిపల్ జనరల్ ఫండ్స్, 14,15 ఆర్థిక సంఘం నిధులతో వార్డులు అభివృద్ధి దిశగా పరుగులు తీస్తున్నాయి.

సందుసందునా సీసీ రోడ్లు..

4వ వార్డులో సందు సందున సీసీ రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టులు నిర్మితమయ్యాయి. తాగునీటి సౌకర్యం కోసం పైపులైన్లు, మినీ వాటర్ స్కీంలు ఏర్పాటు చేశారు. గడిచినా నాలుగున్నరేళ్లలో రూ.50 లక్షల మేర అభివృద్ధి పనులు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.12,34,16,085 మేర ప్రజలకు లబ్ధి చేకూరింది.

4వ వార్డులో వార్డు సమాచారం..

- వార్డులో 4,100 మంది జనాభా ఉండగా, ఇందులో పురుషులు 2 వేలు, మహిళలు 2,100 మంది ఉన్నారు.
- వార్డుల్లో సామాజిక పింఛన్లు 2100 మందికి వస్తున్నాయి.

వార్డులో అభివృద్ధి పనుల వివరాలు

- మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద రూ.42 లక్షలతో 1000 మీటర్లు సీసీ రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు అయ్యాయి.
- బార్‌పేట, సదాశివపేట, పింజారిగేరి, గోకారి జెండా ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించడంతో అందంగా కనిపిస్తున్నాయి.
- బార్‌పేట సందులో ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీ ఎదురుగా మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద 100 మీటర్లు సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు.
- దండుగేరిలో 14వ ఫైనాన్స్, సంఘం నిధులు రూ.36 లక్షలతో 300 మీటర్ల సీసీ రోడ్డు, కాలువలు నిర్మించారు.
- కాడీబోడీ వీధి నుంచి మెయిన్ రోడ్డు గుండా గోకారిజెండా సర్కిల్ వరకు 500 మీటర్ల మేర 8 ఇంచులు పైపులైన్ వేశారు. ఇందుకు మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ.15 లక్షలు ఖర్చు చేశారు.



అరుంజ్యోతినగర్‌లో నాడు-నేడు కింద నిర్మించిన మున్సిపల్ ప్రాథమిక పాఠశాల భవనాలు



- కాడిబోడీ-గోకారిజెండా, బార్‌పేట-మేథర్ మసీదు వీధుల్లో మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద రూ.22.50 లక్షలతో అర కి.మీ. బీటీ రోడ్డును ఏర్పాటు చేశారు.
- మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రూ.60 లక్షలు ఖర్చు చేశారు.
- గరల్స్, బాయ్స్ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి.
- తాహెర్షాముల్లా వీధిలో రూ.40 లక్షలతో ఉర్దూ స్కూల్ నిర్మాణం, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా కాడీబోడీ వీధిలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించారు.
- కాడీబోడీ వీధిలోని మరో సందులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో 150 మీటర్ల సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేశారు.
- దండుగేరి, సదాశివపేట, కాడీబోడీ వీధిలో గడప గడప నిధులు రూ.20 లక్షలతో రోడ్డు, కాలువలు ఏర్పాటు చేశారు.

వివిధ సంక్షేమ పథకాల ద్వారా 4వ వార్డులో ప్రజలకు చేకూరిన లబ్ధి..

- జగనన్న అమ్మ ఒడి పథకం కింద 296 మంది రూ.1,32,86,800 లబ్ధి పొందారు.
- జగనన్న విద్యాదీవెన పథకం కింద 218 మందికి రూ.57,60,982 లబ్ధి చేకూరింది.
- వైఎస్సార్ రైతు భరోసా కింద 34 మందికి రూ.14,75,500 జమ అయ్యింది.
- వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాలు (రైతులు) 15 మందికి రూ.1,67,349 అందాయి.



గోకారిజెండా ఏరియాలో మినీ వాటర్ స్కీం

- ఇన్‌పుట్ సబ్సిడీ ముగ్గురు రైతులకు రూ.66,000 పరిహారం అందింది.
- వైఎస్సార్ పింఛన్ కానుక కింద 397 మందికి రూ.3,73,17,750 లబ్ధి చేకూరింది.
- వైఎస్సార్ చేయూత పథకం కింద 217 మందికి రూ.93,93,750 అందాయి.
- వైఎస్సార్ ఆసరా కింద 289 మంది రూ.59,42,244 లబ్ధి పొందారు.
- వైఎస్సార్ సున్నావడ్డీ (పొదుపు సంఘాల మహిళలకు) 480 మందికి గానూ రూ.10,48,291 విడుదలయ్యాయి.
- వైఎస్సార్ కళ్యాణ మస్తు కింద ఒకరు లబ్ధి పొందగా, రూ.50 వేలు నగదు అందజేశారు.



దండుగేరిలో మున్సిపల్ హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతున్న దృశ్యం

- డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద 89 మందికి రూ.33,12,587 విలువగల వైద్యం అందింది.
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం కింద 45 మందికి రూ.2,90,200 అందాయి.
- హౌసింగ్ లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు. 42 మంది లబ్ధిదారులకు రూ.26,81,236 అందించారు.
- వైఎస్సార్ బీమా పథకం కింద ఐదుగురికి రూ.6.60 లక్షలు అందించారు.
- వైఎస్సార్ వాహనమిత్ర కింద 10 మందికి రూ.2.50 లక్షలు జమ చేశారు.
- వైఎస్సార్ నేతన్న నేస్తం కింద 36 మందికి రూ.30.96 లక్షలు అందజేశారు.
- జగనన్న చేదోడు పథకం కింద 16 మందికి రూ.4.20 లక్షలు అందించారు.
- తెల్లరేషన్‌కార్డుదారులకు కోవిడ్ సమయంలో 646 మందికి రూ.4.46 లక్షలు సాయం అందజేశారు.
- జగనన్నతోడు (వడ్డీ) 45 మందికి రూ.11,152 అందించారు.
- 49 మందికి రూ.1,20,54,000 విలువగల ఇంటి స్థలాలు ఇచ్చారు.
- జగనన్న విద్యా కానుక ద్వారా 132 మందికి రూ.9,37,454 అందజేశారు.
- 8వ తరగతి చదువుతున్న 10 విద్యార్థులకు రూ.1,32,220 ఖర్చు చేసి ట్యాబ్‌లను అందించారు.



కాడీబోడీ-గోకారిజెండా మధ్యలో బీటీ రోడ్డు

- జగనన్నతోడు పథకం కింద 81 మందికి రూ.15,8,139 లబ్ధి చేకూరింది.
- జగనన్న గోరుముద్ద పథకం కింద 131 మంది విద్యార్థులకు రూ.12,97,817 ఖర్చు చేశారు.
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద 216 మందికి రూ.40,45,680 విలువగల పోషకారం అందజేశారు.
- ఇంటింటికి రేషన్ సరఫరా 679 మందికి రూ.1,48,39,076 లబ్ధి చేకూరింది.
- వార్డులో పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ మొత్తం) రూ.3,48,7,396
- డీబీటీ, నాన్ డీబీటీ మొత్తం రూ.12,34,16,085

జగనన్నకు రుణపడి ఉన్నాం



మా వీధిలో గతంలో ఎన్నడూ లేనిది సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టులు ఏర్పాటు చేశారు. రోడ్లు ఏర్పాటుకు ముందు ఇళ్ల ముందు కూర్చోలేని పరిస్థితి. మట్టి రోడ్లు, మట్టి మిద్దెలు కావడంతో ఎలుకలు, పందికొక్కుల బెడద ఎక్కువగా ఉండేది. అందంగా సీసీ రోడ్లు వేయడంతో వాటి సమస్య తొలగిపోయింది. ఇళ్ల ముందు పిల్లాపాపలతో కూర్చొంటున్నాం. చాలా సంతోషంగా ఉంది. జగనన్నకు రుణపడి ఉన్నాం.

– జయమ్మ, కాడీబోడీ వీధి, 4వ వార్డు

అభివృద్ధి అంటే ఇదే మరీ



వార్డులో లక్షలాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశాం. ఎవరూ ఊహించనివిధంగా రోడ్లు, కాలువలు నిర్మించాం. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సహాయ సహకారాలతో మౌలిక వసతులు, రోడ్లు, కాలువలు, తాగునీటి వసతి, వీధి దీపాలు వంటి సౌకర్యాలను కల్పించాం. సందు సందున సీసీ రోడ్లే కనిపిస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లపై చినుకు నీరు కూడా నిలబడకుండా కాలువలో కలిసిపోతున్నాయి. తద్వారా ప్రజల కష్టాలు తొలగిపోయాయి. మా వార్డులో అభివృద్ధికి సహకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి ఎంతో రుణపడి ఉంటాం. అభివృద్ధి అంటే ఇదే మరి.

– ఉమామహేశ్వరి, 4వ వార్డు కౌన్సిలర్

టీడీపీ మరోసారి ప్రతిపక్షంలోనే ఉంటుంది



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా తదితరులు

ఆదోనిరూరల్: టీడీపీని ప్రజలు మరోసారి ప్రతిపక్షంలోనే ఉంచుతారని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు దేవా, మండలాధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, శివకృష్ణ, వెంకటేశులు, నాగప్ప, నల్లారెడ్డి, దేవదాసు అన్నారు. ప్రజల మద్దతు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికే మెండుగా ఉందని, వచ్చే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శనివారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం టీడీపీ నాయకులు చేపట్టిన బీసీ సదస్సులో టీడీపీ ఇన్‌చార్జ్ మీనాక్షినాయుడు, అతడి అనుచరులు తమ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఆయన తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డిలపై అసత్య ఆరోపణలు చేశారన్నారు. వీరెన్ని ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో టీడీపీకి బుద్ధి చెబుతారని జోష్యం చెప్పారు. మీనాక్షినాయుడు గతంలో టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న గుడిసె కృష్ణమ్మకు వెన్నుపోటు పొడిచి ఓడిపోయేలా చేసిన విషయం అందరికీ తెలిసిందేన్నారు. వర్గపోరుతో టీడీపీ అతలాకుతలమయ్యిందని, అసలు ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరో కూడా తెలియని పరిస్థితి ఆ పార్టీలో నెలకొందన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్మన్, మండలాధ్యక్షులు, స్టేట్ డైరెక్టర్లు, మైనార్టీలకు మార్కెట్ యార్డు చైర్మన్ ఇలా అన్నివర్గాల ప్రజలకు పదవులను కట్టబెట్టడం జరిగిందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉరుకుందు, వెంకటేష్, మలేకర్ గోవింద్, నెట్టికల్ సర్పంచ్ రామంజి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా రోడ్డు పనులు

కోసిగి: ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న మాలపల్లి నుంచి పల్లెపాడు, చింతకుంట మీదుగా కోసిగి వరకు రోడ్డు సౌకర్యం ఎట్టకేలకు సాకారం కానుంది. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి చొరవతో నూతన రోడ్డు వేయిస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం కోసిగి, ఎమ్మిగనూరు, కర్నూలుకు వెళ్లేందుకు శిథిలరోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవారు. గుర్తించిన ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు రూ.3 కోట్లతో మాలపల్లి నుంచి కోసిగి వరకు 9.5 కిలోమీటర్లు రోడ్డు పనులకు గత నెల 27న భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఇప్పటి కంకర వేసి లెవెలింగ్ పనులు పూర్తి చేశారు. అలాగే డి.బెళగల్ రోడ్డు పనులు సైతం ముమ్మరంగా సాగుతున్నాయి. రోడ్డు వేస్తుండటంపై ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పూర్తయితే తమకు ఇబ్బందులు తప్పుతాయని పేర్కొంటున్నారు.



చింతకుంట సమీపంలో రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

అభివృద్ధి పనులకు భూమి పూజ

కోసిగి: మండల కేంద్రంలో నెలకొన్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు స్టోరేజీ ట్యాంక్ నుంచి సంప్ వరకు పైప్‌లైన్ ఏర్పాటుకు శనివారం స్థానిక నాయకులు, అధికారులు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి మాట్లాడుతూ రూ.10లక్షలతో విద్యుదీకరణ పనులు పూర్తి చేశామన్నారు. ఇందులో స్టోరేజీ ట్యాంక్ చుట్టూ 24 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే ప్రస్తుతం రూ.10లక్షలతో స్టోరేజీ ట్యాంక్ నుంచి పైప్‌లైన్ వేసి ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. అలాగే స్థానిక 9వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.30 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. శనివారం కాలనీలోని శ్రీరామ టాకీస్ సమీపంలో రోడ్డు పనులను ప్రారంభించారు. ఎంపీపీ ఈరన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున రెడ్డి, ఎస్‌ఐ సతీష్‌కుమార్, నాడుగేని వీరేష్, జగదీష్ స్వామి, కోసిగయ్య, సౌకత్‌అలీ, బుళ్లి నరసింహులు, బసిరెడ్డి, రాజేష్, సోఫిరజాక్, రహీం, బండ్ల గోవిందు, ఎరుకుల లక్ష్మన్న, అయ్యప్ప పాల్గొన్నారు.



భూగేని చెరువులో పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

రైలులో కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

ఆదోనిసెంట్రల్: కేఎస్‌ఆర్ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నం. 16594) రైలులో శుక్రవారం రాత్రి ఆదోని పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కర్ణాటక మద్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డారని రైల్వే ఎస్‌ఐ గోపాల్ తెలిపారు. శనివారం పట్టుబడిన మద్యం, నిందితుల వివరాలను వెల్లడించారు. ఆదోని పట్టణంలోని న్యూగాంధీనగర్‌కు చెందిన హరిజన అంజి, బోయ కృష్ణ, ఈడిగ ఉరుకుందు రాయచూరులో తక్కువ ధరకు కర్ణాటక 90 ఎం.ఎల్. టెట్రా ప్యాకెట్లను కొనుగోలు చేసి ఆదోనికి రైలులో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. సదరు వ్యక్తుల నుంచి మొత్తం 1012 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని పంచనామా చేయడం జరిగిందన్నారు. వాటి విలువ రూ.40,480గా ఉంటుందని చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే ఎస్‌ఐ గోపాల్

స్థల సమస్యకు పరిష్కారం



పట్టాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండలంలోని ఎరిగేరి గ్రామంలో 18 సంవత్సరాలుగా కొనసాగుతున్న సమస్యకు మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పరిష్కారం చూపి లబ్ధిదారుల్లో ఆనందం నింపారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగపు నాయకుడు ప్రదీప్ రెడ్డి తెలిపారు. గ్రామంలో 2006లో సాయిప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇచ్చిన పట్టాలకు శనివారం పొజిషన్ చూపించారు. గ్రామ సర్పంచ్ గోవిందు అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పట్టాలు ఇచ్చిన స్థలంలో ముళ్లకంపలను తొలగించి లే ఔట్ పూర్తి చేసి రాళ్లు కూడా పాతించామని లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. ఇందుకు రాజనగర్ క్యాంపు ఎస్ఎస్ ట్యాంకు నుంచి ప్రత్యేక పైపులైన్ రూ.40 లక్షలతో ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించామని చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు నమ్మకుండా అభివృద్ధిని చూడాలన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామానికి మంజూరైన రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, పరిపాలన అధికారి సత్యన్న, కార్యదర్శి యోగేశ్వర్‌రెడ్డి, గ్రామ ఇన్‌చార్జి నీలకంఠరెడ్డి, మాజీ సర్పంచ్ ధర్మన్న, మండల సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.


నేడు వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో వెలిసిన శ్రీ వాసవీమాతకు ఆదివారం ఆత్మార్పణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ ప్రకాష్, సెక్రటరీలు వేణుగోపాల్, రాంప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక వాసవీమాత ఆలయంలో అమ్మవారికి చీరలతో ప్రత్యేక అలంకారం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి పారాయణం చేశారు. వారు మాట్లాడుతూ అమ్మవారు అగ్నిలో ప్రవేశం చేసిన రోజు సందర్భంగా అమ్మవారి ఆత్మార్పణం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ఉదయం 5 గంటలకు వాసవీమాలధారులకు ఇరుముడి, 6 గంటలకు 108 కలశాలతో ముత్తైదువులచే ఊరేగింపు, పల్లకీలో అమ్మవారి ఊరేగింపు, 8 గంటలకు వాసవీ మాలధారులచే వాసవీమాత హోమం, 9 గంటలకు సామూహిక కుంకుమార్చన, మహిళా మండలిచే 12 గంటలకు మహా మంగళహారతి, 1 గంటకు అన్నప్రసాదం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం సభ్యులు ఆర్యవైశ్య మహిళా మండలి ప్రెసిడెంట్ మిరియాల సరస్వతి, సెక్రటరీ వి.త్రివేణి, ట్రెజరర్ కోట్ర పుష్పలత, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.



చీరల అలంకారంలో వాసవీమాత

విద్యతోనే బంగారు భవిష్యత్




మాట్లాడుతున్న వై.సీతారామిరెడ్డి

మంత్రాలయం : విద్యతోనే బంగారు భవిష్యత్ సాధ్యమని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని టీటీడీ పాలక మండలి సభ్యులు వై. సీతారామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక శ్రీరాఘవేంద్ర జూనియర్, డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమా రెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

కౌతాళం: విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని సీఐ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రతిభ హైస్కూల్ 21వ వార్షికోత్సవ వేడుకలను కరస్పాండెంట్ దూద్‌బాషా అధ్యక్షతన శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ లక్ష్యం చేరాలంటే కష్టపడి చదవాలని చెప్పారు. ఆదోని డివిజన్ కార్పొరేట్ పాఠశాలల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సర్పంచ్ పాల్‌దినకర్, ఖాదర్‌లింగ స్వామి దర్గా చిన్నతాత మున్నపాషా, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, పలువురు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, హెచ్‌ఎం జ్ఞానేశ్వరి, ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ ఉప ప్రధాన అర్చకుడు మహదేవస్వామి పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం